
ఆర్‌ఎంపీ చారి లొంగుబాటు

లింగ నిర్ధారణ కేసులో ప్రధాన నిందితుడు

చింతకాని, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ కేసులో ప్రధాన నిందితుడిగా వున్న ఖమ్మం నగర పరిధిలోని పాండురంగాపురానికి చెందిన సల్లోజు వెంకటేష్ అలియాస్ ఆర్‌ఎంపీ చారి శనివారం చింతకాని పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. గత నెల 27న మండల పరిధిలోని కొదుమూరు గ్రామంలోని ఓ ఇంట్లో నిబంధనలకు విరుద్ధంగా మినీ అల్ట్రా స్కానింగ్ మెషిన్‌తో గర్భిణులకు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారన్న సమాచారం మేరకు ఖమ్మం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ ఘటనలో కొదుమూరు గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ మనోజ్‌తోపాటు ఖమ్మం నగరానికి చెందిన స్కానింగ్ అసిస్టెంట్ కాత్యాయనిని అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు పాండురంగాపురానికి చెందిన చారి పరారీలో ఉండగా, పది రోజుల అనంతరం శనివారం ఉదయం హైకోర్టు న్యాయవాదిని వెంట బెట్టుకుని వచ్చి ఎస్‌ఐ ఎదుట లొంగిపోయాడు. పోలీసులు ఆయనకు నోటీస్ ఇచ్చి పంపివేశారు.

చివరకు మిగిలేది?



నామినేటెడ్ పదవులు భర్తీకాక నిరాశలో కాంగ్రెస్ నాయకులు

- అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటినా.. ఎదురుచూపులే..
- ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా.. నెరవేరని ఆశలు
- తమకు రిక్తహస్తాలే మిగులుతాయా అని ఆవేదన
- మంత్రుల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడమే సమస్య

ఖమ్మం, మార్చి 8 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): పదేళ్ల సుదీర్ఘ విరామం తరువాత పార్టీ అధికారంలోకి రావడంతో ఇన్నేళ్ల కష్టానికి ఫలితంగా తమకు నామినేటెడ్ పదవులు దక్కుతాయని ఆశపడ్డ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు నిరాశే మిగులుతోంది.

నామినేటెడ్ పదవుల భర్తీకి రాష్ట్రస్థాయిలో ఉన్న స్తబ్దతకు తోడు జిల్లాలోని ముగ్గురు మంత్రుల మధ్య సమన్వయ లోపం కూడా అవరోధంగా మారింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగుస్తున్న వేళ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా మీనాక్షి నటరాజన్ నియామకం, ఆమె నిర్వహిస్తున్న సమీక్షల నేపథ్యంలో పదవుల నియామకం వేగవంతం అవుతుందని భావిస్తున్నా.. జిల్లాలో మాత్రం రాజకీయ పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి.

ముగ్గురి మధ్య పీటముడి

గతంలో జిల్లాకు ఒక మంత్రి మాత్రమే ఉన్నప్పుడు ఆయన చెప్పిందే వేదంగా నియామక పదవుల భర్తీ చకచకా సాగిపోయేది. ఈ సారి రాష్ట్ర రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మూడు మంత్రి పదవులను కేటాయించారు. ఉప ముఖ్యమంత్రిగా మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్థానం దక్కించుకున్నారు.

ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు అతిరథులు ప్రాతినిథ్యం వహిస్తున్నా.. నామినేటెడ్ ఆశావహులకు రిక్తహస్తాలే మిగులుతున్నాయి. మార్కెట్ కమిటీలు, చిన్నాచితక పదవుల నియామకానికి దాదాపు ఏడాదికాలం పట్టింది. స్థానిక ఎమ్మెల్యేల పరిధిలో ఉన్న పదవులు కూడా ఇంకా కొన్ని భర్తీకాని పరిస్థితి. జిల్లాలో అవునన్నా కాదన్నా ముగ్గురు మంత్రుల మధ్య సఖ్యత లేని పరిస్థితి నెలకొంది. ఎవరిదారిన వారు పయనం సాగిస్తున్నారు జిల్లా, రాష్ట్రస్థాయి పదవుల విషయంలో నాయకులకు పదవులు కల్పించేందుకు ఉమ్మడి సమావేశాలు నిర్వహించడంలేదు.

జిల్లా పర్యటనకు వచ్చినా తమ నియోజకవర్గాల్లో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, అభినందనలు, ఓదార్పులు, పరామర్శలకే పరిమితమవుతున్నారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాకు నాలుగు కార్పొరేషన్ పదవులు దక్కాయి. భట్టి విక్రమార్క సిఫార్సుతో వైరాకు చెందిన నాయుడు సత్యనారాయణకు (మిగతా 6వ పేజీలో)

రాజీయే రాజమార్గం

- అహాలు, కోపతాపాలు తగ్గించుకుంటే కేసులు పరిష్కారమవుతాయి
- కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దు
- జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్
- జిల్లా కోర్టులో లోక్ అదాలత్... 19,345 కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్

ఖమ్మం లీగల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లో ఇరుపక్షాల మధ్య రాజీ కుదరటం వల్ల కక్షిదారులకు మానసిక ప్రశాంతత లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ అన్నారు. ఖమ్మం జిల్లా కోర్టు ఆవరణలో శనివారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ లోక్‌అదాలత్‌ను ఆయన ప్రారంభించారు. ఇరు వర్గాల కక్షిదారులు రాజీపడితే ఆర్థిక ప్రయోజనాలతో పాటు సమయం వృథా కాదని, గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని అన్నారు. కక్షిదారులు అహం తగ్గించుకొని ఒకరికొకరు సహకరించుకోవటం ద్వారా కేసులు త్వరగా పరిష్కరించబడతాయని అన్నారు. అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి మాట్లాడుతూ తక్షణ పరిష్కారం లోక్ అదాలత్ ద్వారానే సాధ్యమన్నారు. మహిళలు అన్ని రంగా ల్లో ముందుండాలని, మహిళా అభివృద్ధి కోసం కృషి చేయాలని అన్నారు.

ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు లోక్ అదాలత్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి కె.వి.చంద్రశేఖరరావు అధ్యక్షత వహించారు. అనంతరం మోటారు ప్రమాదంలో భర్తను కోల్పోయిన మహిళకు రూ.14లక్షల అవార్డును అందజేసి పూలమొక్కను బహూకరించారు. కక్షిదారులకు న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి, మంచినీటి సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో న్యాయాధికారులు ఎం.అర్చనకుమారి, దేవినేని రాంప్రసాద్‌రావు, ఎం.కల్పన, వి.శివరంజని, కాసరగడ్డ దీప, బిక్కం రజని, ఏపూరి బిందుప్రియ, వి.మాధవి, బి.నాగలక్ష్మి, న్యాయవాదులు, కక్షిదారులు, ఇన్సూరెన్స్ కంపెనీ బాధ్యులు, పలు బ్యాంకుల బాధ్యులు పాల్గొన్నారు.

19,345 కేసుల పరిష్కారం

ఖమ్మం జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ ఆధ్వర్యంలో శనివారం జిల్లావ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 19,345 కేసులు పరిష్కారం అయ్యాయి. వాహన ప్రమాద కేసులు 62 వాటిని పరిష్కరించి బాధితులకు రూ.2కోట్ల 71లక్ష 77వేలు నష్టపరిహారాన్ని ఇప్పించారు. ప్రీ లిటిగేషన్ కేసులు 18, క్రిమినల్ కేసులు 643, సివిల్ కేసులు 51, చెక్‌బౌన్స్ కేసులు 2,318, వివా హకేసులు 6, సైబర్‌కేసులు 78, ట్రాఫిక్ చలానాలు 16,169, ఈ లోక్‌అదాలత్‌లో 13 బెంచ్‌లు ఏర్పాటుచేశారు.

వెల వెలా గోదారి..

- ఇసుక తిన్నెలతో దర్శనమిస్తున్న నది
- 2.6 అడుగుల కనిష్ఠ నీటిమట్టం నమోదు



భద్రాచలం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జీవనది గోదావరి పేరు వినగానే సోయగాలు... పరవళ్లు.. హొయలతో జల జల పారుతూ వడి వడిగా కదులుతూ సాధారణంగా దర్శనమిస్తుంది. కానీ మార్చి నెలలోనే గోదావరి భద్రాచలం వద్ద చూస్తే బక్కచిక్కినట్టు కనిపిస్తోంది. శనివారం గోదావరి నీటిమట్టం 2.6 అడుగులు నమోదైంది. ఎగువ భాగాన నీటిమట్టాలు కనిష్టస్థాయికి పడిపోతుండటం ఆ ప్రభావం కారణంగా గోదావరి తన సహజ సిద్ధ స్వరూపాన్ని క్రమేపి కోల్పోతోంది. దీంతో ఇసుక తిన్నెలు, బండరాళ్లతో దర్శనమిస్తోంది. అంతే కాదు కొన్ని చోట్ల గోదావరిని నిశితంగా పరిశీలిస్తే క్రీడామైదానాన్ని తలపిస్తోంది. మొత్తం మీద గోదావరి తన సహజశైలికి భిన్నంగా దర్శనమిస్తుండటంతో రాబోయే ఏప్రిల్, మే నెలల్లో గోదావరి ఇంకే రీతిలో కనబడుతోందోననే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా 2022 మార్చి 8న భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 4.4 అడుగులు ఉంది. 2023 మార్చి 8న 1.4 అడుగులు, 2024 మార్చి 8న 3.5 అడుగులు ఉండగా ఈ ఏడాది 2.6 అడుగులు ఉంది.

మహిళలు మరింత ఎదగాలి..

- ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
- ప్రాథమిక విద్యతోనే చదువు ఆపకూడదు
- సమాజంలో స్త్రీ, పురుష వివక్ష పూర్తిగా తొలగిపోవాలి
- ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ
- టీజీవో ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం
- పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు


సత్తాను చాటుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ, టీజీవో మహిళలు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో స్త్రీ పురుష తారతమ్యం తొలగిపోవాలని, అందరూ లింగవివక్షను విడనాడాలని, మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని అప్పుడే సమజాభివృద్ధి సాధ్యం అవుతుందని జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీజ, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. అంకితభావంతో పనిచేస్తేనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని వారు పేర్కొన్నారు.

ఖమ్మంనగరంలోని టీజీవో జిల్లా కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ నగర పాలక సంస్థ మొదలుకొని స్థానిక సంస్థల వరకు మహిళల పాత్ర ఎంతో ఉందన్నారు. జనాభాసగభాగం ఉన్న మహిళలు విద్యావంతులుగా ఉండాలని, బాలికలు పదో తరగతి (మిగతా 6వ పేజీలో)

మహిళ ఓ అద్భుత శక్తి
భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్
6

వేసవిలో సాఫీగా విద్యుత్ సరఫరా

- ఆటంకాలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు
- కొత్త లైన్ల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు
- ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాసాచారి

6

రెండు ఆటోలు ఒక బైక్ ఢీ

- రోడ్డు ప్రమాదంలో 11 మందికి గాయాలు
- ఆటో యూ టర్న్ చేస్తుండగా ఘటన


కేంద్రమంత్రికి వినతి పత్రాన్ని అందిస్తున్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి

రైల్వే ప్రాజెక్టులు పూర్తి చేయండి...

- మల్కాన్‌గిరి రైలు మార్గాన్ని త్వరితగతిన చేపట్టాలి
- సత్తుపల్లి-కొవ్వూరు, పెనుబల్లి-కొండపల్లి రైల్వేలైన్లు మంజూరు చేయాలి
- కేంద్ర రైల్వే మంత్రికి మంత్రి తుమ్మల వినతి
- మంత్రి కోమటిరెడ్డి ద్వారా లేఖ

ఖమ్మం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు శనివారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. ఆ లేఖను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ద్వారా కేంద్రమంత్రికి అందజేశారు. ఇటీవల రాసిన లేఖకు స్పందించి పాండురంగాపురం - మల్కాన్‌గిరి రైల్వేలైన్ మంజూరు చేసినందుకు కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కి మంత్రి తుమ్మల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ రైల్వే మార్గాన్ని సారపాక (భద్రాచలం) వరకు త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, ఇందుకు తగిన చర్యలు (మిగతా 6వ పేజీలో)



హైదరాబాద్ ప్రజాభవన్‌లో భట్టి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని

పార్లమెంట్‌లో గళం విప్పుతా : ఎంపీ

కొత్తగూడెం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న రాష్ట్రానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన శనివారం నిర్వహించిన తెలంగాణ ఎంపీల సమావేశంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడారు. మొత్తం 28 అంశాలపై చర్చలు జరిగే ప్రతిపాదనలు రూపొందించగా.. ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు సంబంధించిన కీలక అంశాలపై ఎంపీ రఘురాంరెడ్డి ప్రస్తావన తెచ్చారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతిపాదించిన రెండు రైల్వేలైన్లు మార్చాలని, డోర్నకల్ నుంచి మిర్యాలగూడ (జాన్‌పహాడ్), గద్వాల బీజీ రోడ్ రైల్వేలైన్ అలైన్‌మెంట్ పునఃపరిశీలించాలని, ప్రత్యామ్నాయంగా డోర్నకల్ వెన్నారం మన్నెగూడెం, మరిపెడ, మోతే మీదుగా తుది అలైన్‌మెంట్ మంజూరుచేయాలని, ఉభయ జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారుల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని, ఖమ్మం దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే, కోదాడ-ఖమ్మం హైవేలకు సంబంధించి గతంలో సూచించిన రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న మేరకు బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, వెనుకబడిన ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్లు రవాణా సౌకర్యాలు మెరుగుపర్చాలన్నారు.

కేంద్రం విధానాలతో సాగుకు దూరమవుతున్న రైతులు

మహిళా రైతులు ఉద్యమాల్లో భాగస్వాములు కావాలి : పోతినేని

వైరా, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలతో రైతులు సాగుకు దూరమవుతున్నారని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి నిధులు కోత పెట్టి కార్పొరేట్ సంస్థలకు రాయితీలు, ప్రోత్సాహకాలు అందించారని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో మహిళా రైతులు కూడా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. వైరాలోని ఠాగూర్ కాలేజీలో మాజీ ఎంపీపీ బొంతు సమత అధ్యక్షతన జరిగిన ఖమ్మంజిల్లా మహిళా రైతు సదస్సులో పోతినేని పాల్గొని ప్రసంగించారు. ఆరుగాలం కష్టపడి పండించిన రైతులకు గిట్టుబాటు ధర లేక దేశంలో 2014నుంచి 2022వరకు లక్షమందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వాసిరెడ్డి చైతన్య మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్దతులను అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. డాక్టర్ చైతన్యను ఘనంగా సన్మానించారు. తెలంగాణ రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, మహిళా నాయకురాళ్లు శీలం పకీరమ్మ, ఉమ, నర్వనేని పద్మావతి, చింతనిప్పు సులోచన, గాలి అరుణ, దొడ్డపనేని జ్యోతి, లక్ష్మి, ఉష, రాధ, జయ పాల్గొన్నారు.

రైల్వే ప్రాజెక్టులు పూర్తి చేయండి...

(5వ పేజీ తరువాయి)

తీసుకోవాలని కేంద్ర మంత్రికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టు అమలైతే భద్రాచలానికి తరలివచ్చే భక్తులకు మరింత సౌకర్యం లభిస్తుందని, యాత్రికుల సంఖ్య పెరిగే అవకాశముందన్నారు. గోదావరి నదిపై నిర్మించాల్సిన రైల్వే బ్రిడ్జి పనులను కూడా వేగంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు. ముందుగా సారపాక వరకు రైల్వేలైన్‌ను పూర్తిచేస్తే, భక్తులు రైలు మార్గంలో సారపాక చేరుకుని, అక్కడినుంచి బస్సులు, ఇతర రవాణా సదుపాయాల ద్వారా భద్రాచలానికి చేరుకునే వీలుంటుందని వివరించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి - కొవ్వూరు, పెనుబల్లి (ఖమ్మం)- కొండపల్లి(అమరావతి) వరకు కొత్త రైల్వేలైన్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని లేఖ ద్వారా కోరారు. ఈ రైల్వే లైన్‌తో రెండు తెలుగు రాష్ట్రాలకు మరింత రవాణా సదుపాయం అందుబాటులోకి వస్తుందని వాణిజ్య విస్తరణకు ఎంతగానో తోడ్పడుతుందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. దీంతో పాటు ఇరురాష్ట్రాలకు విద్య వైద్య రంగాలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని మంత్రి తుమ్మల ఆ లేఖలో ప్రస్తావించారు.

మహిళా శక్తిని చాటిచెప్పాలి

- మహిళలకు ప్రోత్సాహాన్నిస్తున్న టీఎన్జీవో సంఘం పనితీరు ప్రశంసనీయం
- టీజీజేఏసీ సెక్రెటరీ జనరల్, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి8 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో నిగూఢంగా శక్తి దాగి ఉందని, దాన్ని వెలికితీసేందుకు ప్రతి మహిళ తన ప్రతిభకు పదును పెట్టాలని టీజీజేఏసీ సెక్రటరీ, టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు అన్నారు. మహిళలను అన్ని రంగాల్లో టీఎన్జీవో ఉద్యోగ సంఘం ప్రోత్సహిస్తుందన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీఎన్జీవో ఫంక్షన్ హాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను ఏలూరి శ్రీనివాసరావు, టీఎన్జీవో నాయకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మహిళలకు అన్ని రంగాల్లోనూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్నారని తమ శక్తిని చాటిచెప్పి సామాజికాభివృద్ధికి దోహదపడాలని వారు కోరారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి మాట్లాడుతూ ఏ రంగంలోనైనా సత్తా చాటే మహిళలను గుర్తించి వారికి సముచిత స్థానాన్ని కల్పించడంలో టీఎన్జీవో సంఘం ఎప్పుడూ అగ్రభాగాన ఉంటుందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముందు మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను అందచేశారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న మహిళా అధికారులను, ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బి.కళావతిభాయిని ఘనంగా సత్కరించారు. స్థానిక కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల నరేందర్ మహిళా సాధికారతకు తన వంతు కృషి చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస మహిళా విభాగం చైర్‌పర్సన్ జి.మృదుల, కన్వీనర్ బీవీ సుబ్బమ్మ, టీఎన్జీవోస జిల్లా కార్యదర్శి కొనిదెన శ్రీనివాస్, ట్రెజరర్ వల్లపు వెంకన్న, ఉపాధ్యక్షురాలు లలితకుమారి, జాయింట్ సెక్రెటరీ శీలం రాధికారెడ్డి కార్యవర్గ సభ్యురాలు నెల్లూరి విజయ, నాగలక్ష్మి, మహిళా విభాగం కార్యవర్గం వెంకటమ్మ, భావన వెన్నెల, కోమలి, శ్రావణి, సుజాత, జోత్స్న, హసీనా, వసంత, రమ్య, రాంబాయి, షేక్ జరీనా, పద్మావతి, శ్యామల, లక్ష్మి, మాధురి, నాగలక్ష్మి, ఫాతిమా,మాణిక్యం, రమాదేవి, పార్వతి, హిమబిందు పాల్గొన్నారు.



హాజరైన మహిళా ఉద్యోగులు



మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

మహిళ ఓ అద్భుత శక్తి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

దుమ్ముగూడెం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి):మహిళ ఓ అద్భుత శక్తి, ప్రకృతి ప్రతి అందానికి నిర్వచనం, ఇంటికి దీపం, అమృత వర్షిణి, తల్లి, చెల్లి, భార్యగా అనురాగాల్ని కురిపించే దేవతని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ అభివర్ణించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని బొజ్జిగుప్ప ఎకో టూరిజం కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టరు తెల్లం వెంకట్రావుతో కలిసి పాల్గొన్నారు. మన దేశంలో మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, మహిళా సమానత్వం అనేది మన ఇంటి నుంచే ప్రారంభం కావాలన్నారు. సమాజంలో స్త్రీ పాత్ర ఎంతో ముఖ్యమని, ఒక ప్రజాప్రతినిధి, కలెక్టర్, టీచర్, డాక్టర్, పోలీస్ ఆఫీసర్, పైలట్, రైతు కూలీ, ఇంటి పనులు చేసే మనిషిగా అన్ని హోదాల్లో గుర్తింపు పొందిందన్నారు. విద్య, జ్ఞాన శక్తి స్వరూపులైన అమ్మవార్లు కూడా స్త్రీలేనన్నారు. గిరిజనులు చాలా కష్టజీవులని, బొజ్జిగుప్ప టూరిజం కేంద్రం ఏర్పాటుకు ఎంతో శ్రమించారన్నారు. భద్రాచలం వచ్చే యాత్రికులకు ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, వంటకాలను తెలిపేందుకు ప్రయత్నం చేసి సత్ఫలితాలను పొందామన్నారు. గ్రామాల్లో పండే కరక్కాయలు, ఇప్పపూలను అందంగా డిజైన్ చేసి ఇతర దేశాలకు ఎగుమతి చేసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఆడపిల్లల్ని మగ పిల్లలతో సమానంగా చూడాలని ఎమ్మెల్యే వెంకట్రావు అన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు పెద్ద పీట వేయడం వల్ల దేశం పురోగమిస్తుందన్నారు. గిరిజన మహిళలు అందించిన రాగి జావను ఎమ్మెల్యే వెంకట్రావు, కలెక్టర్లు సేవించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. అనంతరం పర్ణశాలను సందర్శించి ఆలయ ప్రధాన రహదారికిరు వైపులా ఉన్న దుకాణాల తొలగింపు, వేరే ప్రదేశంలో ఏర్పాటుకు సంబంధించిన విషయాలను పరిశీలించారు. దుకాణదారులతో మాట్లాడి తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ స్థలాన్ని కొలత వేసి గుర్తించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. సీఐ అశోక్, ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, గిర్దావరు కల్లూరి వెంకటేశ్వరావు, నాయకులు అన్నె సత్యనారాయణ మూర్తి, కుంజా శ్రీనివాస్, అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

చివరకు మిగిలేది..?

(5వ పేజీ తరువాయి)

హస్తకళాభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి లభించిది.. అలాగే గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా రాయల నాగేశ్వరరావుకు పదవి దక్కింది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఫార్సుతో రాష్ట్రనీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా మువ్వా విజయ్‌బాబుకు పదవి దక్కింది. భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న పొదెం వీరయ్యకు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి లభించింది.

కీలకమైన పదవులున్నీ పెండింగే...

ఇటు ఖమ్మం,అటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కీలక పదవులన్నీపెండింగ్‌లో ఉన్నాయి. ఈ పదవులపై ఆశలుపెట్టుకుని అనేకమంది నాయకులు ఏడాదిగా తిరుగుతున్నారు. ముగ్గురు మంత్రులు ఏకాభిప్రాయానికి వచ్చే పరిస్థితి లేకపోవడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికాని పీసీసీ కాని జిల్లాలో ప్రభుత్వ నియామక పదవులకు ఎవరినీ సిఫార్సు చేయడంలేదు. దీనికి తోడు ముగ్గురు మంత్రులతో పాటు కేంద్రమాజీమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి కూడా తన వర్గీయులెవరికీ అవకాశం ఇవ్వలేదని ఎమ్మెల్సీతో పాటు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు, జిల్లాస్థాయి పదవులు తమకు ఇవ్వాలనిపార్టీ అధిష్టానం వద్ద పట్టుబడుతున్నారు. ఏ పదవి నియామకం జరగాలన్నా ముగ్గురు మంత్రులతో పాటు రేణుకావర్గీయులకు కూడా అవకాశాలు ఇవ్వాల్సిన పరిస్థితి జిల్లాలో నెలకొంది. ఈ పరిస్థితుల్లో నామినేటెడ్ పదవులు ఎప్పుడు భర్తీ అవుతాయో.. అసలు భర్తీ అవుతాయో లేదో.. తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.

సీతారామ నీరు గ్రామానికి రావడంతో పాదయాత్ర

పెనుబల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్టు నీరు తమ గ్రామానికి చేరాయని హర్షం వ్యక్తం చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన 25మంది మహిళలతోపాటు 12మంది రైతులు విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం వరకు పాదయాత్ర చేపట్టారు. పంటలు ఎండిపోయి పెట్టుబడులు రాక ఇబ్బందులు పడుతూ ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న గోదావరి నీళ్లను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో తమ గ్రామానికి చేరాయని రైతులు పాదయాత్రకు పూనుకున్నారు. శనివారం పెనుబల్లి మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు రైతులకు స్వాగతం పలికారు. అపర భగీరథుడి పేరున్న తుమ్మల నాగేశ్వరరావు ఏప్రభుత్వంలో ఉన్నా రైతుల బాగోగుల కోసం శ్రమిస్తారని ఆయన కృషి వలనే మా గ్రామానికి సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీళ్లు చేరాయని మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. జుబ్బిరాళ్ల వరలక్ష్మి, కనకదుర్గ, బొమ్మెర అనూష, చేకూరి లక్ష్మి, మాయల కేశవులు, కేశవ్, బొమ్మెరబోయిన మధు, డింకర ప్రసాద్ పాదయాత్రలో పాల్గొన్నారు.

వేసవిలో సాఫీగా విద్యుత్ సరఫరా

- ఆటంకాలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు
- కొత్తలైన్ల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు
- మార్చి చివరినాటికి పనులన్నీ పూర్తి
- ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసాచారి



కూసుమంచి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వేసవిలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసినట్టు ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసాచారి తెలిపారు. కూసుమంచి ఏడీఈ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

వేసవి సమీపిస్తోందని, ఎండలు ఇప్పటికే మండుతున్నందున వ్యవసాయ, గృహ విద్యుత్ వినియోగం వేసవిలో ఒక్కసారిగా పెరుగుతోందని తెలిపారు. డిమాండ్ తట్టుకునేలా విద్యుత్ శాఖ ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా అవసరమైన ముందస్తు పనుల్ని పూర్తి చేస్తున్నట్టు తెలిపారు.

సబ్‌స్టేషన్ల కనెక్టివిటీ

ఖమ్మం సర్కిల్ పరిధిలో జిల్లాలోని సబ్‌స్టేషన్లన్నీ కనెక్టవిటీ చేస్తున్నట్టు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, మెయింటెనెన్స్ సమయంలో ఒకలైన్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయినా.. వినియోగదారులకు, ఆటంకాలు లేకుండా మరొక సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యామ్నాయ లైన్ (ఇంటర్‌లింక్ లైన్) ద్వారా విద్యుత్ సరఫరా అయ్యేలా కనెక్టివిటీ చేస్తున్నట్టు తెలిపారు. 72 సబ్‌స్టేషన్లను గుర్తించి 36 లైన్లను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆరు సబ్‌స్టేషన్లలో ఓవర్‌లోడ్ అధిగమించేందుకు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ పెంచుతున్నట్టు పేర్కొన్నారు. లోడ్‌ను మూడు భాగాలుగా 60, 80, 100 శాతంగా విభజించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల లోడ్‌ను గుర్తించి వాటి సామర్ధ్యాలు పెంచినట్టు తెలిపారు. ఇక డొమెస్టిక్ సర్వీసులకు సంబంధించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. భారీ వర్షాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడితే.. వేగంగా పునరుద్ధరించేందుకు బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పనులన్నీ యుద్ధప్రాతిపదిక చేస్తున్నామని సాధ్యమైనంత వరకు ఈనెలాఖరు వరకు పూర్తిచేయనున్నట్టు ఆయన వివరించారు. ప్రభుత్వం ప్రజలకు విద్యుత్ సరఫరాలో మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. ఎంత ఖర్చైనా భరిస్తూ నూతన లైన్లను ఏర్పాటు చేస్తుందన్నారు.

పెరుగుతున్న వినియోగం

మార్చి నెల ప్రారంభంలోనే ఎండలు సుర్రుమంటున్నాయని ఎస్‌ఈ శ్రీనివాసాచారి తెలిపారు. జిల్లాలో 7మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగమవుతుందన్నారు. ఎండలు ముదిరే కొద్ది వినియోగం మరింత పెరిగే అవకాశం ఉందని గుర్తించినట్టు తెలిపారు. 8.5 మిలియన్ యూనిట్ల వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. వినియోగం ఎంత పెరిగినా నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు తెలిపారు.

1500 కనెక్షన్లు పెండింగ్

జిల్లాలో ఇంకా సుమారు 1500 వ్యవసాయ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయని ఎస్‌ఈ తెలిపారు. వీటన్నింటినీ పంటలు పూర్తయ్యాక మంజూరు చేస్తామన్నారు. అదేవిధంగా వివిధ కారణాల వల్ల కొందరికి గృహజ్యోతి మంజూరు అయిందని, వారి పాత బకాయిలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. అదేవిధంగా కొత్తవారికి కనెక్షన్లు ఇచ్చే విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. విలేకరుల సమావేశంలో కూసుమంచి ఏడీఈ కోక్యానాయక్ ఉన్నారు.

రెండు ఆటోలు, బైక్ ఢీ..

- రోడ్డు ప్రమాదంలో 11 మందికి గాయాలు

కొణిజర్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రెండు ఆటోలు, ఒక ద్విచక్ర వాహనం రోడ్డు ప్రమాదానికి లోనైన సంఘటనలో 11 మందికి గాయాలయ్యాయి. ఊహించని విధంగా జరిగిన ఈ ఘటనతో పలువురికి గాయాలయ్యాయి. మండలంలోని తనికెళ్ల గ్రామం దాటిన తర్వాత శనివారం ఈ ఘటన జరిగింది. స్థానికులు, క్షతగాత్రులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వెంకటాయపాలెం నుంచి ఓ ఆటోలో సుమారు పది మందికిపైగా ప్రయాణికులు మధిరకు ఓ కార్యక్రమానికి బయలుదేరారు. తనికెళ్ల గ్రామం దాటిన తర్వాత వీరి ముందు వెళ్లుతున్న ఆటో డ్రైవర్ ఆటోను నిలిపి ఒక ప్రయాణికురాలిని దింపాడు. తిరిగి ఆటోను ఖమ్మం వైపు తిప్పేందుకు యూటర్న్ చేయబోయి వెనుకనే ప్రయాణికులతో వస్తున్న ఆటోను ఢీకొట్టాడు. దీంతో ప్రయాణికులతో ఉన్న ఆటో రోడ్డుపై పల్టీ కొట్టింది. యూటర్న్ చేయబోయిన ఆటో రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఈ ఆటో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. రోడ్డుపై పడిన ఆటోలో మాత్రం ప్రయాణికులకు గాయాలు అయ్యాయి. అంతా వెంకటాయపాలెంకు చెందిన వారే. వారిలో వెంకటలక్ష్మి, హేమలత, లక్ష్మి, నరసింహారావు, సంధ్య, మానస, అరుణ, సుజాత, నాగేశ్వరరావులకు గాయాలు అయ్యాయి.

అదే సమయంలో తల్లాడ నుంచి ఖమ్మానికి ద్విచక్రవాహనంపై నాగార్జునరెడ్డి, సత్య దంపతులు వస్తుండగా పల్టీ కొట్టిన ఆటో వారి వాహనానికి తగిలింది. దీంతో వారి ద్విచక్రవాహనం కూడా పల్టీ కొట్టింది. ఈ ఘటనలో భార్యాభర్తలకు గాయాలు అయ్యాయి. యూటర్న్ చేసుకుంటున్న ఆటోనే తాము ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొట్టిందని ప్రయాణికులు వాపోయారు. క్షతగాత్రులను రెండు 108 వాహనాల ద్వారా ఖమ్మం తరలించారు.



ప్రమాదానికి గురైన ఆటో



బాధితులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

మహిళలు మరింత ఎదగాలి..

(5వ పేజీ తరువాయి)

అనంతరం చదువును నిలిపివేయకుండా కనీసం డిగ్రీ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం మహిళలకు కల్పించే అవకాశాలను సద్వినియోగపరుచుకోవాలన్నారు. మహిళలకు సమాజంలో విలువలు పెరగాలంటే విద్య అవసరమన్నారు. విద్యాపరంగా అభివృద్ధి చెందితే మహిళలకు దక్కాల్సిన అన్ని సౌకర్యాలు లభిస్తాయన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద జిల్లాల్లో రెండో జిల్లాగా ఖమ్మం జిల్లా మహిళలు పరిపాలనలో తమదైన పాత్రతో ముందుకు పోతున్నారని అభినందించారు. వారు నిరంతరం కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూ ఉద్యోగ బాధ్యతల్లో కూడా ముందున్నారని రాబోయే తరాలకు మహిళా అధికారులు మార్గదర్శకులుగా ఉండి వారిని ముందుకు నడిపించాలని రాబోయే తరానికి నేటి మహిళలు ఆదర్శంగా ఉండాలని, అన్ని రంగాలలో కూడా ముందుంటున్నారని అన్నారు. పని చేస్తున్న కార్యాలయాలలో కూడా పలువురికి ఆదర్శంగా ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమాన్ని జి.ఉషశ్రీ, పి.సుధారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు క్రీడ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీజీవో జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ, కార్యదర్శి మోదుగు వేలాద్రి, ట్రెజరర్ శేషు ప్రసాద్, హౌస్ బిల్డింగ్ సొసైటీ జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.విజయ్‌కుమార్, రమేష్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి శ్రీనివాస్, మహిళా కార్యదర్శి పి.సుధారాణి, డాక్టర్ బాబు రత్నాకర్, జి.రమేష్, మన్యం రమేష్ బాబు, డాక్టర్ హరీష్, శ్రీనివాసరావు, కిషోర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు వెంకట పుల్లయ్య, కార్యదర్శి మహేష్ ప్రసాద్ అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, కార్యదర్శి పుల్లయ్య, యూటీఎఫ్ రంజాన్, ఎస్టీఎఫ్ నాయకుడు దేవరకొండ సైదులు, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాస్, కొణిదెన శ్రీనివాస్ ప్రమీల, వాసవి రాణి, రాజ్యలక్ష్మి, శైలజ, లావణ్య, లలిత, తాళ్లూరి శ్రీకాంత్ వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ శ్రీజను సన్మానిస్తున్న దృశ్యం



శ్రీవారి ఉత్సవమూర్తులు

శ్రీవారి గర్భాలయంలోకి ఉత్సవమూర్తులు

ఎర్రుపాలెం, మార్చి8(ఆంధ్రజ్యోతి): జమలాపురంలోని వకుళమాత స్టేడియంలో శాంతి కల్యాణం నిర్వహించిన శ్రీవారి ఉత్సవమూర్తులు గ్రామోత్సవం అనంతరం శనివారం అర్చకులు గర్భాలయానికి చేర్చారు. ఆలయంలో ఉత్సవమూర్తులకు నిత్య దీపారాధనలు, అర్చనలు, అభిషేకాలు నిరంతరాయంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా స్టేడియం నిర్మాణదాత తుళ్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ యేటా జమలాపురంలో నిర్వహించే వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీవారి కల్యాణం కోసం శ్రీవారిపై భక్తిశ్రద్ధలతో తమ మానస పుత్రికలాంటి వకుళమాత స్టేడియం కల్యాణం మండపాన్ని నిర్మించామన్నారు. ఈకార్యక్రమానికి వారంరోజులుగా శ్రమించి, భక్తులకు అసౌకర్యం కలగకుండా మండపం ప్రారంభోత్సవాన్ని విజయవం చేసిన గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇకనుంచి శ్రీవారి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగాలని, జమలాపురం ఆలయ ప్రతిష్ట రాష్ట్రస్థాయిలో వెలుగొందాలని ఆశాభావం వ్యక్తంచేశారు.



దగ్ధమవుతున్న వరిగడ్డివాము

అగ్నిప్రమాదంలో వరిగడ్డి వాముల దగ్ధం

తల్లాడ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామంలో నాలుగు వరిగడ్డి వాములు దగ్ధమయ్యాయి. కుర్నవల్లి గ్రామానికి చెందిన ఎక్కిరాల శ్రీనివాసరావు, ఎక్కిరాల చెన్నయ్య, వెంకటి, వీరస్వామిల వరిగడ్డి వాములు దగ్ధమయ్యాయి. వరిగడ్డివాముల సమీపంలోని ఓ వ్యక్తి తన ఇంటి ఆవరణంలో ఉన్న రాలిన టేకు ఆకులను కుప్పగా చేసి నిప్పంటించాడు. గాలికి నిప్పురవ్వలు లేచి పక్కనే ఉన్న వరిగడ్డివాముల మీద పడటంతో ఈ ప్రమాదం సంభవించినట్లు స్థానికులు తెలిపారు. వైరా నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను అదుపు చేసింది. సుమారు రూ.50వేల మేరకు నష్టం వాటిల్లింది. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది మాట్లాడుతూ వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నిప్పుతో జాగ్రత్తగా ఉండాలని అన్నారు.

కొండ గొర్రె మాంసం పట్టివేత

గుండాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వేటగాళ్లకు దొరికిన కొండ గొర్రె మాంసాన్ని పట్టుకొని కేసు నమోదు చేసిన సంఘటన మండలంలో శనివారం జరిగింది. అటవీ శాఖ అధికారుల వివరాల ప్రకారం.. చింతలపాడు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు చేపల వేటకు వెళ్లగా కుక్కలు ఓ కొండ గొర్రెను వేటాడాయి. కాగా ఆ మాంసాన్ని తెచ్చుకున్న ఆ ఇద్దరు వ్యక్తులు అటవీ శాఖ అధికారులకు పట్టుబడ్డారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టుకు సరెండర్ చేసినట్లు అటవీ శాఖ అధికారులు నరసింహారావు, బాలాజీ తెలిపారు.



కూరగాయలను పరిశీలిస్తున్న మంత్రి

సేంద్రియ సాగుపై మంత్రి తుమ్మల సంతృప్తి

దమ్మపేట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు చెందిన అప్పారావుపేట వ్యవసాయక్షేత్రంలో సేంద్రియపద్ధతిలో కూరగాయల సాగును చేపట్టారు. వ్యవసాయక్షేత్రంలో సాగు చేస్తున్న విభిన్న రకాల కూరగాయలను మంత్రి తుమ్మల శనివారం ఉదయం సందర్శించి పరిశీలించారు. వ్యవసాయక్షేత్రంలో అంతర పంటలుగా వివిధ రకాల మిర్చిసాగు, రకరకాల క్యాబేజి, క్యాలీఫ్లవర్, క్యాప్సికం, టమాట, సొరకాయి తదితర పంటలను సేంద్రియపద్ధతిలో సాగు చేయగా కూరగాయలు నాణ్యంగా ఉండటంతో మంత్రి సంతృప్తి వ్యక్తం చేసారు. సిబ్బందికి సాగుపై మంత్రి పలు సూచనలు చేశారు. ఆయన వెంట కాసాని నాగప్రసాదు, మంగేశ్వరరావు, తుమ్మల శేషుబాబు తదితరులు ఉన్నారు.

రామాలయ ముఖ మండపానికి
ఇత్తడి కవచం

- రూ.3లక్షలతో ఏర్పాటు చేసిన భక్తురాలు



ఆలయ ద్వారాలకు ఏర్పాటు చేసిన ఇత్తడి తొడుగు

దుమ్ముగూడెం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి వారి అనుబంధ ఆలయమైన పర్ణశాల రామాలయ ముఖ మండపానికి ఇత్తడి తొడుగును ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు చెందిన భక్తురాలు మహాలక్ష్మి రూ.3లక్షల వ్యయంతో ముఖ మండపం, ద్వారాలకు పూర్తిగా ఇత్తడి తొడుగు చేయించారు. శ్రీరామనవమి నాటికి ఆలయ ధ్వజస్తంభం, బలిపీఠాలకు సైతం ఇత్తడి తొడుగు చేయించేందుకు దాత ముందుకొచ్చారు. దార్ల టెంపుల్ వర్క్స్ యజమాని రాఘవ ఆధ్వర్యంలో పనులను నిర్వహించారు. ఇత్తడి తొడుగు ఏర్పాటుతో ఆలయ ముఖ ద్వారం శోభాయమానంగా భక్తులకు కనువిందు చేస్తోంది. దాత మహాలక్ష్మికి ఆలయ ఈవో రమాదేవి, ఆలయ ఇంచార్జి అనీల్‌కుమార్, అర్చక, ఆలయ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.



కొత్తగూడెం రైల్వే స్టేషన్ (భద్రాచలం రోడ్) ముఖద్వారం



మరమ్మతుల కోసం తీసుకువచ్చిన ముడి సామగ్రి

పట్టాలు తప్పిన పనులు

- నత్తనడకన కొత్తగూడెం రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు
- మొత్తం రూ.24 కోట్ల కేటాయింపు.. ఇప్పటివరకు రూ.11కోట్ల విడుదల
- నిధుల కొరతతో నెల రోజులుగా ఆగిపోయిన పనులు
- అసౌకర్యాలతో ప్రయాణికుల ఇక్కట్లు
- లాభాల పంట పండుతున్నా స్పందించని అధికారులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ అమృత్ భారత్ పథకంలో భాగంగా కొత్తగూడెం రైల్వే స్టేషన్ (భద్రాచలం రోడ్)ను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో రూ.23 కోట్ల నిధులు కేటాయించారు. ఇప్పటివరకు రూ.11 కోట్లు విడుదల చేసి 2023 ఏడాది నవంబరులో రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రాంగణంలో ఉన్న రైల్వే స్టేషన్ రూపాన్ని తొలగించి ప్రాంగణంలో, అంతర్గత భవనాలను పూర్తిగా నేల మట్టం చేసి భారీ స్థాయిలో పనులను ప్రారంభించారు. అయితే రెండేళ్లు పూర్తి అవుతున్నా నిర్మాణ పనుల వేగం నత్తేనయం అన్నట్లు దర్శనమిస్తున్నాయి. రైల్వే స్టేషన్‌లో స్లీపర్, అప్పర్ క్లాస్ వెయిటింగ్ హాల్, ఫేస్ లిఫ్టింగ్, రూఫ్ లీకేజెస్, అధికారుల ప్రత్యేక గదులు, పార్కింగ్, ఫుడ్ ప్లాజా, గార్డెనింగ్, ప్రధాన ముఖద్వారం పనులు చేపట్టారు. అయితే నిధుల లేమితో మరమ్మతు పనులు నెల రోజుల క్రితం ఆగిపోయాయి. మిగతా నిధులు రూ.12 కోట్లు మంజూరైతేనే నిర్మాణ పనులు వేగంగా జరుగుతాయని అంటున్నారు.

ప్రయాణికుల తిప్పలు

కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుంచి ప్రతి రోజు కాకతీయ ప్యాసింజర్, సింగరేణి ప్యాసింజర్, డోర్నకల్ ప్యాసింజర్, విజయవాడ ప్యాసింజర్, కొల్హాపూర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు గూడ్స్ రైళ్లు నడిచేవి. ప్రస్తుతం కాకతీయ, సింగరేణి ప్యాసింజర్లు, మణుగూరు ఎక్స్‌ప్రెస్ మాత్రమే నడిపిస్తూ రైల్వే అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఈ రైళ్లను ఎక్కేందుకు ప్రయాణికులు రైల్వేస్టేషన్ ప్రాంగణానికి విచ్చేసే సమయాల్లో ప్రాంగణం వెలుపల, బయట తవ్విన గోతులు, నిర్మాణ పనులకు కుప్పలు తెప్పలుగా వేసి ఉన్న మెటీరియల్ వలన నడవలేని దుస్థితి ఏర్పడింది.



ప్లాట్‌ఫాం షెడ్ కప్పును తొలగించిన దృశ్యం

సౌకర్యాలు నిల్... లాభాలు ఫుల్ ...

అత్యధిక లాభాలను సౌత్ సెంట్రల్ రైల్వేకు అందించే కొత్తగూడెం రైల్వే స్టేషన్‌కు మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండేళ్ల క్రితం ప్రారంభమైన మరమ్మతు పనుల వలన ప్రయాణికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే స్టేషన్‌లో వెయిటింగ్ హాల్ , ఏసీ వెయిటింగ్ హాల్ లేకపోవడం దారుణం. మరుగుదొడ్లు లేకపోవడం గమనార్హం. ప్రైవేటు ఏజెన్సీతో రైల్వే అధికారులు స్టేషన్ ప్రాంగణంలో సులబ్ కాంప్లెక్స్‌లను నిర్మించి ప్రారంభించారు. దీంతో ప్రయాణికులు తమ జేబులను చిల్లులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్యధోరణి విడనాడి మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రైల్వే బోర్డు పరిధిలోనే నిర్మాణాలు

రామ్ భజన్ మీనా, ఏరియా మేనేజర్

కొత్తగూడెం రైల్వే స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతు పనులు రైల్వే బోర్డు పర్యవేక్షణలో సీనియర్ సెక్షన్ ఇంజనీర్ (ఎస్ఎస్ఈ) విభాగం వారి పరిధిలో ఉన్నాయి. నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. రైల్వే ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

రామాలయానికి మూడు 'ఈ హుండీ స్కానర్‌లు'

- అందజేసిన ఎస్‌బీఐ భద్రాచలం రామాలయం శాఖ



స్కానర్‌లను అందజేస్తున్న ఆర్ఎం సత్యనారాయణ

భద్రాచలం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయానికి ఎస్‌బీఐ భద్రాచలం రామాలయం శాఖ మూడు 'ఈ హుండీ స్కానర్‌లను అందజేసింది. శనివారం భద్రాద్రి దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్, శ్రీనివాసరెడ్డికి ఎస్‌బీఐ ఆర్ఎం ఎం.సత్యనారాయణ, ఎస్‌బీఐ భద్రాచలం రామాలయం శాఖ చీఫ్ మేనేజరు మధుసూదన్ శర్మలు లాంఛనంగా అందజేశారు.

భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసార్చన

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి శనివారం ఆర్జిత సేవలో భాగంగా స్వర్ణ తులసార్చన నిర్వహించారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ నిర్వహించారు.



విద్యుత్ దీపాలు లేని భద్రాచలం రెండో వంతెన

నిర్లక్ష్యానికి 'వారధి'

- రెండో వంతెనపై కానరాని విద్యుత్ దీపాలు
- ప్రమాదకరంగా భద్రాచలం వైపు ప్రవేశ పరిసరాలు
- కోతకు గురైనా పట్టించుకోని అధికారులు

భద్రాచలం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద గోదావరిపై రెండో వారధి నిర్వహణ తీరుపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. దశాబ్దకాలంగా నిర్మాణం పూర్తికాకుండా ఉన్న రెండో వారధి పనులను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేశారు. మంత్రి తుమ్మల ఆదేశాలతోనే ఏప్రిల్ 17న శ్రీరామనవమికి రెండో వారధి భక్తులకు అందుబాటులోకి వచ్చింది. ఈ క్రమంలో 15వ తేదీన అప్పటి జిల్లా కలెక్టరు ప్రియాంక ఆలా లాంఛనంగా వారధిపై రాకపోకలను ప్రారంభించారు. ఆనాడు శ్రీరామనవమి భక్తుల కోసం అత్యవసరంగా రెండో వారధిని ప్రారంభించారు. అయితే దాదాపు ఏడాది గడుస్తున్నా ఇంత వరకు రెండో వారధిపై విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయంలో సారపాక వైపు నుంచి భద్రాచలం వచ్చే వాహన చోదకులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయమై సంబంధిత కాంట్రాక్టరు, అధికారులు ఎవరు పట్టించుకోకపోవడంతో వాహన చోదకుల అవస్థలు అంత ఇంత కాదు.



వర్షాలకు కోతకు గురైన వారధి పక్క ప్రాంతం

ఇదిలా ఉండగా సారపాక నుంచి భద్రాచలం వైపు వచ్చే రెండో వారధి ద్వారా వచ్చే మార్గంలో వారధి చివర ఎడమ వైపు గత ఏడాది కురిసిన వర్షాలకు ఆ ప్రాంతం కోతకు గురైనా ఆ విషయాన్ని సైతం కాంట్రాక్టరు, అధికారులు విస్మరించడం గమనార్హం. అప్రోచ్ రోడ్డు ఆరంభ ప్రాంతంలో తాత్కాలికంగా బస్తాలతో ఏర్పాటు చేసిన ప్రాంతం ప్రమాదకరంగా మారింది. కాగా భద్రాచలం వైపు వారధిపై అప్రోచ్ రోడ్డుకు ఇరువైపులా రైలింగ్ నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని భద్రాద్రివాసులు కోరుతున్నారు.



రెయిలింగ్ లేని వంతెన

విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజు
- ఘనంగా పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ మహిళా కళాశాల వార్షికోత్సవం



బహుమతి అందజేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

పాల్వంచ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం అలవరచుకోవాలని, తద్వారా ఉన్నత లక్ష్యాలకు మార్గం సునాయాసమవుతుందని భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ మహిళా కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్పీ రోహిత్‌రాజ్, స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ సెక్రెటరీ పుల్లయ్య హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చదువులో ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ విద్యార్థినులు విద్యార్థులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తుండటం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థిని ఏకాగ్రత, క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాలతో ముందుకు సాగితే విజయం వారికి దాసోహం అవుతుందని అన్నారు. అనంతరం స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ సెక్రెటరీ పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతో పాటు తమలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ తలశిల భరత్‌కృష్ణ, సెక్రెటరీ అవని, ప్రిన్సిపాల్స్ డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ రవి, వైస్ ప్రిన్సిపాల్ వెంకన్న పాల్గొన్నారు.



జవహర్‌లాల్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మంత్రి తుమ్మల

జవహర్‌లాల్‌కు కన్నీటి వీడ్కోలు

- నివాళులర్పించిన పలువురు నాయకులు

ఖమ్మంక్రైం, మార్చి8(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ సోదరుడు, మేడ్చల్ పోలీసుట్రైనింగ్ సెంటర్ వైస్ ప్రిన్సిపాల్, డీఎస్పీ బానోతు జవహర్‌లాల్(50) రోడ్డుప్రమాదంలో మృతి చెందడంతో ఆయన మృతదేహానికి రఘునాథపాలెం మండలం ఈర్లపుడి గ్రామంలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈర్లపుడికి వెళ్లి పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్‌ను ఓదార్చారు. మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార, బీఆర్ఎస్ ఖమ్మంజిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దినేని వెంకటరమణతోపాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు.

క్రైం సమాచారం

మునిసిపల్ కార్మికుడి ఆత్మహత్య

ఇల్లెందు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఇల్లెందు పట్టణానికి చెందిన మునిసిపాలిటీ తాత్కాలిక కార్మికుడు బొప్పి రామారావు(46) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం తన ఇంట్లో క్రిమిసంహారక మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ రామారావు శనివారం సాయంత్రం ఆస్పత్రిలో మృతి చెందాడు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

మద్యానికి బానిసై వ్యక్తి మృతి

కరకగూడెం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలాద్రిపేట వలస గ్రామానికి చెందిన సోడి మాసయ్య (35)అనే వ్యక్తి కుటుంబ కలహాలతో మద్యానికి బానిసై అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. కరకగూడెం ఎస్ఐ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు మాసయ్య కుటుంబ కలహాలతో గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో శనివారం ఇంటి వద్ద మృతి చెందాడు. మృతుడి బాబాయి సోడి మడకం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవ పరీక్షకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు.

10మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

ఇల్లెందు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు పట్టణం సమీపంలో సత్యనారాయణపురం- నెం- 2 బస్తీల నడుమ అటవీప్రాంతంలో శనివారం సాయంత్రం పోలీస్ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో 10మంది పేకాటరాయుళ్లు అరెస్టయ్యారని సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపారు. నిర్మానుష్య ప్రదేశంలో పేకాటాడుతున్న సమాచారంతో జరిపిన దాడుల్లో ఇల్లెందుకు చెందిన ఉమ్మిసాని కనకయ్య, మక్బూల్, బండి నాగర్జున, జే. రాజ(రొంపేడ్), ఏం. సత్యనారాయణ(ఖమ్మం), మోహన్‌రావు (సత్యనారాయణపురం), బత్తుల కోటేశ్వరరావు(హన్మకొండ), భూక్యా ప్రవీణ్(కొత్తగూడెం), బానోత్ చిన్న(బయ్యారం), రాజా(రొంపేడ్)ను అరెస్ట్‌చేశామని, మరో నలుగురు పరారీలో ఉన్నారని తెలిపారు. సంఘటనా స్థలంలో మూడు ద్విచక్ర వాహనాలు, రూ.82వేల నగదు, 8సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

యువతి అదృశ్యం

చింతకాని, మార్చి 8(ఆంధ్రజ్యోతి): చింతకాని మండల కేంద్రానికి చెందిన ఓ యువతి ఈ నెల 7వ తేదీ రాత్రి అదృశ్యమైనట్లు ఆమె తండ్రి పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. సదరు యువతికి గత నెల 24న కోదాడకు చెందిన ఓ యువకుడితో నిశ్చితార్థం అయింది. పెండ్లికి ఇంట్లో దాచిన రూ.2.50 లక్షలు తీసుకుని అదృశ్యమైనట్లు ఆమె తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు.

చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్ట్

- వివరాలను వెల్లడించిన సీఐ సతీష్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సతీష్

పాల్వంచ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ నవభారత్ కాలనీలో చోరీలకు పాల్పడిన దొంగల్లో ఒకరిని పాల్వంచ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నవభారత్ కాలనీ చోరీ జిల్లాలో సంచలనం రేకెత్తించిన విషయం తెలిసిందే. ఆ బడా చోరీలో సుమారు రూ.60 లక్షల విలువైన బంగారం, నగదు అపహరణకు గురైంది. చోరీకి పాల్పడిన వ్యక్తి పాల్వంచ సీ-కాలనీలో మరలా దొంగతనం చేయడానికి రెక్కీ నిర్వహిస్తుండగా అనుమానించిన పోలీసులు అతణ్ని అరెస్ట్ చేశారు. ఆ విషయాలను పాల్వంచ సీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సీఐ సతీష్ వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం... మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లాకు చెందిన అనీల్ సింఘార్ తన ప్రాంతానికే చెందిన మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి జనవరి 25న పాల్వంచ వచ్చాడు. నవభారత్ కాలనీలో 10 క్వార్టర్లలో చోరీకి పాల్పడి తమ స్వరాష్ట్రానికి పారిపోయారు. అప్పటి నుంచి పోలీసుల కళ్లుకప్పి తప్పించుకు తిరుగుతున్న వారి కోసం భద్రాద్రి జిల్లా సీసీఎస్, పాల్వంచ టౌన్ పోలీసులు స్పెషల్ టీంలను ఏర్పాటు చేసుకుని గాలిస్తున్నారు. అంతా సద్దుమణిగిందని భావించిన అనీల్ సింఘార్ మరో పెద్ద చోరీకి పథకం రచించాడు. ఈ క్రమంలోనే అతను కేటీపీఎస్ -సీ కాలనీలో రెక్కీ నిర్వహిస్తుండగా స్థానికులకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు అనుమానాస్పదంగా వ్యవహరిస్తున్న అతనిని స్టేషన్‌కు తరలించి విచారించగా తాను తన ప్రాంతంలోని మరో ముగ్గురితో కలసి నవభారత్ కలనీలో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. దీంతో అతనిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి రూ. 2లక్షల నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అతణ్ని కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ సతీష్ తెలిపారు. ఈ సమావేశంలో పాల్వంచ టౌన్ ఎస్ఐ సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి వివాదం..

- పోలీసులను ఆశ్రయించిన లిఫ్టు చైర్మన్, ఆయకట్టు రైతు

వైరా, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుణ్యపురంలో లిఫ్టు ఇరిగేషన్ కింద సాగునీటి విషయంలో ఆ లిఫ్టు ఇరిగేషన్ చైర్మన్ యంగల కృష్ణకు, ఆయకట్టు రైతు ఎనిక కోటేశ్వరరావు మధ్య చోటుచేసుకున్న వివాదం కాస్తా ఘర్షణకు దారితీసింది. తనపై రైతు కోటేశ్వరరావు ఆయన భార్య రాధిక కలిసి దాడి చేశారని చైర్మన్ కృష్ణ పోలీసులకు శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేశారు. అదే సమయంలో కృష్ణ తన భర్త కోటేశ్వరరావు తనపై దాడి చేశాడని రాధిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. పుణ్యపురంలో లిఫ్టు కింద 80 మందికి చెందిన దాదాపు 150ఎకరాల భూమి సాగవుతుంది. గతనెల 22న ఆయకట్టులోని తన ఐదెకరాల పంటతోపాటు దాని పరిధిలో లేని మరో ఐదెకరాల పంటలకు కోటేశ్వరరావు అక్రమంగా సాగునీరు మళ్లించిన విషయమై చైర్మన్ కృష్ణ రైతును నిలదీశాడు. ఈ విషయమై ఇరువురి మధ్య వాగ్వాదం, ఘర్షణ జరిగింది. అదేరోజు కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లిఫ్టు కింద రైతులు లిఫ్టు నిర్వహణకు సంబంధించిన డబ్బులు చెల్లించాలని రైతులను కోరారు. అదే సమయంలో రైతు కోటేశ్వరరావు వద్దకు డబ్బుల కోసం మరో రైతు గద్దె వసంతరావును పంపించారు. ఆసమయంలోనే చైర్మన్ కృష్ణ రైతు కోటేశ్వరరావుకు మధ్య మళ్లీ ఘర్షణ జరిగింది. ఆసమయంలోనే రైతు కోటేశ్వరరావు తన భార్య రాధికతో కలిసి తనను కులం పేరుతో దూషిస్తూ కొట్టారని కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే తాను తన భర్త కోటేశ్వరరావు కూరగాయలు తెచ్చుకొనేందుకు వెళ్తుండగా కృష్ణ తనను దూషించి తన భర్త కోటేశ్వరరావును కొట్టాడని ఆయనపై చర్యలు తీసుకోవాలని రాధిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. వైరా ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ శనివారం ఆగ్రామంలో విచారణ నిర్వహించారు.

ట్రాక్టర్ పల్టీ..

చింతకాని, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తాపడి ఐదుగురికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని జగన్నాథపురంసమీపంలో శనివారం చోటుచేసుకుంది. ట్రాక్టర్ చింతకాని నుండి తిమ్మినేనిపాలెం వెళ్తున్న క్రమంలో రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి దాటిన తరువాత జగన్నాథపురం గ్రామానికి చెందిన నలుగురు వ్యవసాయ కూలీలు యరమాల సత్యావతి, కాశిమాల తిరుపమ్మ, కందా చిన్నబోసు, కొత్తపల్లి నర్సమ్మ కేవలం గ్రామం 500 మీటర్ల దూరం ఉండగా ట్రాక్టర్ ఎక్కారు. కొద్దిదూరం ట్రాక్టర్ ముందుకు వెళ్లిన తరువాత మూలమలుపు వద్ద ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో కందా చిన్నబోసుకు, డ్రైవర్ అలవాల వెంకటేశ్వర్లు తలకు తీవ్రగాయాలయ్యాయి.



మహిళా దినోత్సవం

శనివారం ఖమ్మంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలు కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులను అధికారులు, రాజకీయ నాయకులు సన్మానించారు. విద్యాలయాల్లోనూ వేడుకలు నిర్వహించారు. మహిళల ఔన్నత్యాన్ని వివరించారు. కేకు కట్ చేసి పంచారు. మరికొన్నిచోట్ల మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.



కృషిభవన్ కమిటీ ఆధ్వర్యంలో మహిళా అధికారులకు సన్మానం



ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో..



పోలీసు సిబ్బందిని సన్మానిస్తున్న గల్లా..



టీడీపీ ఆధ్వర్యంలో..



నేలకొండపల్లిలో..



న్యూవిజన్‌లో..



చైతన్యలో..



రెజోనెన్స్ శ్రీనగర్‌కాలనీలో..



టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో




పీఆర్‌టీయు ఆధ్వర్యంలో..



యూటీఎఫ్ ఆధ్వర్యంలో

16న అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ



వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి8(ఆంధ్రజ్యోతి): నగరంలోని 10వ డివిజన్ చైతన్య నగర్ బైపాస్ రోడ్‌లో శ్రీధర్మ శాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో ఈనెల 16 విగ్రహ ప్రతిష్ఠ, 17న పదునెట్టాంబడి ప్రాణప్రతిష్ఠ జరుగుతాయని ఆలయ ఛైర్మన్ మేకల హనుమంతరావు అన్నారు. శనివారం ఆలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆలయంలో విఘ్నేశ్వరస్వామి, నాగేంద్రస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, మాలికాపురత్తమ్మ వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నామని, 16న ఉదయం 10:26 నిమిషాల నుంచి 11:30 నిమిషాల మధ్య కేరళ తంత్రి తక్కే కోరమంగళం దామోదరన్ నంబూద్రి, పాకతిల్లం నారాయణన్ నంబూద్రి మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 17న ఉదయం 11:37 నుంచి మధ్యాహ్నం 1:40 మధ్య ధ్వజస్తంభము, పదునెట్టాంబడుల ప్రాణప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈనెల10నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. చావా నారాయణరావు మాట్లాడుతూ ఈఆలయం 2023 డిసెంబరు 18న శంకుస్థాపన చేశామని పనులు శరవేగంతో పూర్తి చేశారని, అందుకు సహకరించిన కమిటీ సభ్యులకు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయం ముందున్న కాలువపై స్లాబ్ వేస్తున్నట్లు చెప్పారు. 16న విగ్రహ ప్రతిష్ఠ అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో 10వ డివిజన్ కార్పొరేటర్ చావా మాధురి, 11వ డివిజన్ కార్పొరేటర్ సరిపుడి రమా సతీష్, ఆలయ ట్రస్టు సభ్యులు వెంపటి సత్యనారాయణ, అట్లూరి మధు, ఆలస్యం నారాయణరావు, టివి పుల్లంరాజు, సరిపుడి నాగేశ్వరరావు, వేజండ్ల రవీంద్రబాబు, టెక్నికల్ ఇంజనీర్ నల్లమల సత్యంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువుకు ఆర్థికసాయం

రూ.1.04లక్షల చెక్కును అందజేసిన రామచంద్రాపురం వాసులు



నవ్యకు చెక్కును అందిస్తున్న ఉదయ్‌కుమార్

నేలకొండపల్లి, మార్చి8(ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన కేశా నవ్యకు శనివారం గ్రామానికే చెందిన ఐపీఎస్ అధికారి దేవరపల్లి ఉదయ్‌కుమార్‌రెడ్డి రూ.1.04 లక్షల చెక్కును అందించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ చెక్కును అందించారు. గ్రామానికి చెందిన నవ్య ఉన్నత చదువుల కోసం గ్రామస్తులు చెక్కును అందజేశారు. తరగతి, ఇంటర్మీడియెట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన గ్రామానికి చెందిన వారికి ప్రోత్సాహకంగా రూ.10 వేలు నగదును అందచేస్తానని ఉదయ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్వరరావు, లింగా వెంకట్రామిరెడ్డి, కేశ సత్యానారాయణ,పి.లక్ష్మీనారాయణ,మదారమ్మ, దినేష్, ఉపేందర్, విక్రమ్ పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ ఉత్సవాలను జయప్రదం చేయండి

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి8(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ 12వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈనెల14న ఏపీలోని పిఠాపురంలో జరిగే ఉత్సవాలను విజయవంతం చేయాలని పార్టీ ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి మిరియాల రామకృష్ణ కోరారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ నేటికి అవే సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీని ముందుకు తీసుకు పోతున్నారన్నారు.

సరుకుల వితరణ



కూసుమంచి, మార్చి8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో పదిమంది నిరుపేద కుటుంబాలకు చేగువేరా భూపతి ఫౌండేషన్ ద్వారా నెలకు సరిపడ సరుకులు వితరణగా అందించారు. మండలంలోని నాయకన్‌గూడెం, పెరికశింగారం, గట్టుసింగారం, కూసుమంచి గ్రామాల్లో పదిమంది వృద్ధాప్యంలో ఉన్న కుటుంబాలను గుర్తించి వారి ఇళ్లకు వెళ్లి అందించారు. పేదవారిని ఆదుకోవడమే లక్ష్యంగా నిరంతరంగా సరుకులు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఫౌండేషన్ ఛైర్మన్ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో కిన్నెర శ్రీకాంత్, భీమయ్య, నాని, కొండలరావు, సందీప్, రాధిక పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి సీపీ అభినందన

ఖమ్మంక్రైం,మార్చి8(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్ ద్వారా 20,029 కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అభినందించారు. శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ మార్గాన కేసులను పరిష్కరించటానికి కోర్టులో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో జిల్లా పరిధిలో ఉన్న రాజీ పడదగిన కేసుల పరిష్కారానికి ఏఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పకడ్బందీగా వ్యవహరించారన్నారు. నిందితులు, కక్షిదారులకు సమాచారం అందించి వారికి అవగాహన కల్పించారని ప్రశంసించారు. లోక్‌అదాలత్‌లో జిల్లా పరిధిలో 20,029 కేసులు పరిష్కరించటం జరిగిందని అన్నారు.

రెండో అదనపు ప్రథమశ్రేణి కోర్టులో 485 కేసుల పరిష్కారం

న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ



కేసులు పరిష్కరిస్తున్న బిందుప్రియ

ఖమ్మంలీగల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఖమ్మం రెండోఅదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ నిర్వహించిన లోక్‌అదాలత్‌లో మొత్తం 485 కేసులను పరిష్కరించారు. చెల్లనిచెక్కు కేసులు 3, మనోవర్తి కేసులు1, సివిల్ దావాలు3 వీటితోపాటు క్రిమినల్ కేసులు 479 పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఖానాపురంహవేలి పోలీస్‌స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ వి.రామకృష్ణ, ముదిగొండ పోలీస్‌స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ ఆదినారాయణ, ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి సహకరించారు.

పట్టపగలు బాంబుల మోత

- పెద్ద ఎత్తున తాటి చెట్లు నరికివేత
- పట్టించుకోని అధికారులు




తాటిచెట్లను నరికి కాల్చిన దృశ్యం, బాంబులు అమర్చుతున్న దృశ్యం

ఖమ్మంరూరల్, మార్చి8(ఆంధ్రజ్యోతి): జనవాసాల మధ్య పట్టపగలు ప్రధాన రహదారి వెంబడి బాంబుల మోత మోగుతోంది. పెద్ద పెద్దరాళ్లు పగిలిపైకి లేచి ఎగసిపడుతున్నాయి. ఇది చూసిన స్థానికులు రాళ్లు ఎక్కడ తమపై పడతాయోనని అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని బతుకుతున్నారు. అంతేకాకుండా గీతా కార్మికుల జీవనాధారమైన తాటి చెట్లను పెద్ద మొత్తంలో పెకిలించి కాల్చిబొగ్గు చేస్తు గీతా కార్మికుల పొట్టగొడుతున్నారు.. ఇది ఖమ్మం రూరల్ మండలం, ఆరెంపులలో పట్టపగలు జరుగుతున్న తతంగం.. ఖమ్మంరూరల్ మండలం, ఆరెంపుల శివారులో సుమారు 20 ఎకరాల భూమిలో ఉన్న పెద్ద రాళ్లను బాంబులు, జిలిటెన్ స్టిక్స్‌తో పేల్చుతున్నారు. అది కూడా జనవాసాల మధ్య నిత్యం జనం తిరిగే సమయంలో పట్టపగలు బాంబులు పేల్చుతున్నారు. బాంబుల తాకిడికి రాళ్లు పగిలి పైకి లేచి పడుతున్నాయి. అవి ఎవరిపైనైనా పడితే ప్రమాదం సంభవిస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా ఈ భూమిలో ఉన్నటువంటి భారీతాటి చెట్లను నేలకూలుస్తున్నారు. సుమారు వంద తాటి చెట్లకు పైగా నరికి కాల్చి వేసినట్లు స్థానికులు చెబుతున్నారు.గీతకార్మికులకు జీవనాధారమైన తాటి వనం నిప్పుల్లో కాలిపోతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు అటువైపు కన్నెత్తికూడా చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీస్, ఎక్సైజ్‌శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే బాంబులు పెట్టడం, తాటి చెట్లు నరకడం చేస్తున్నా పట్టించుకోవటం లేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి అక్రమంగా బ్లాస్టింగ్ చేసి, తాటి చెట్లను నరికి వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనలపై ఎక్సైజ్ సీఐ బాస చంద్రమోహన్‌ను ప్రశ్నించగా బాంబుల బ్లాస్టింగ్‌కు సంబందించి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉత్సాహంగా పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు



కేక్‌కట్‌చేస్తున్న నిశాశర్మ

ఖమ్మంక్రైం, మార్చి8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ పాఠశాలలో శనివారం పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్కూల్ ఛైర్‌పర్సన్ నిశాశర్మ హాజరయ్యారు. ప్రతీ విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.అనంతరం పాఠశాలలో విద్యార్థులతో కలిసి మహిళ దినోత్సవం నిర్వహించారు. కేక్‌కట్‌చేసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు హర్షణీయం

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించి చట్టబద్ధంగా కేబినేట్ ఆమోదం తెలపడం హర్షణీయమని బీసీ జేఏసీ ఛైర్మన్ పెరుగు వెంకటరమణ యాదవ్ అన్నారు. శనివారం ఖమ్మంనగరంలోని ఓ హోటల్‌లో బీసీ జేఏసీ సదస్సు నిర్వహించారు.తొలుత మహిళ దినోత్సవం సందర్భంగా మాతా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. బీసీలసమస్యలపై మరిన్నిపోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈకార్యక్రమంలో చేకూరి చైతన్య, జి.నరేందర్, పాల్వంచ రామారావు, కత్తి నెహ్రూగౌడ్, స్వర్ణకుమారి, గరిడేపల్లి సత్యనారాయణ, చల్ల హనుమంతు, మేకల సుగుణారావు పాల్గొన్నారు.

ఘనంగా విద్యాక్షేత్ర పాఠశాల వార్షికోత్సవం



ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విద్యాక్షేత్ర పాఠశాల ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సామాజికవేత్త పి.గణేశం, డీఈవో సోమశేఖరశర్మ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. వత్తిడిలేని విద్యను అందిస్తున్నదుకు పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యాబోధనను అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ భారతి చెరుకూరి, వి.నాగభూషణం, కరస్పాండెంట్ సౌభాగ్య తదితరులు పాల్గొన్నారు.

కానరాని మద్దులపల్లి క్లస్టర్ ఏఈఓ

- నెలరోజులుగా రైతువేదికకు తాళం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు



తెరుచుకోని మద్దులపల్లి రైతువేదిక

కామేపల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మద్దులపల్లి క్లస్టర్ ఏఈఓపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులుగా రైతు వేదిక తాళం తీయడం లేదని చెబుతున్నారు. రైతులు ఫోన్ చేస్తే కామేపల్లి రమ్మంటున్నాడని, అక్కడకి వెళితే దురుసుగా ప్రవర్తిస్తున్నాడని పేర్కొన్నారు. రైతులు ఏదైన ప్రభుత్వ పథకాల గురించి అడిగితే నాకు తెలియదు మీరే తెలసుకొండి అని నిర్లక్ష్యపు సమాధానంతో మాట దాటేస్తున్నడని తెలిపారు. ఇటీవల అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు తగిన పరిహారం కూడా అందలేదని అతని నిర్లక్ష్యమే కారణమని రైతులు చెబుతున్నారు. గతంలో ఇక్కడ పని చేసిన ఏఈఓ జగదీష్ అనునిత్యం రైతులకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించేడాడని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే ఇక్కడనుంచి పనిచేస్తున్న ఏఈఓని బదిలీ చేయాలని కోరుతున్నారు.

అందుబాటులో ఉండటం లేదు

జాలె శ్రీను, బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యుడు



అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించాడు.ఫలితంగా నష్టపోయిన రైతులకు లబ్ధి చేకూర లేదు. సకాలంలో రైతులు అందుబాటులో లేకుండా దురుసుగా ప్రవర్తిస్తున్నాడు.. రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదు.

కల్యాణోత్సవాలకు ఆలయం ముస్తాబు

వేంసూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుకూరులోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఈనెల 10వతేదీ నుంచి 15వతేదీ వరకు నిర్వహించనున్నారు. 10న ప్రత్యేక పూజలు, ధ్వజారోహణం, 11న నిత్య హోమం, బలిహరణ, ఎదుర్కోలు ఉత్సవం, 12న ప్రత్యేక పూజలు, రాత్రి శ్రీస్వామివారి కల్యాణ మహోత్సవం, 13న స్వామివారి గ్రామ సేవ అన్నదాన కార్యక్రమం, రాత్రి 9.30 గంటలకు స్వామివారి దివ్య రథోత్సవం, 14న దొంగల దోపోత్సవం, 15న ప్రత్యేక పూజలు, రాత్రి స్వామివారి పవళింపు సేవ నిర్వహించనున్నారు.

ఆదర్శప్రాయుడు రాయల



మాట్లాడుతున్న గుమ్మడి నరసయ్య

తిరుమలాయపాలెం, మార్చి8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అసువులబాసి పిండిప్రోలు గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన రాయల నాగేశ్వరరావు ఆదర్శప్రాయుడని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య తెలిపారు. శనివారం మండలంలోని పిండిప్రోలులో రాయల నాగేశ్వరరరావు రెండో వర్ధంతి సందర్భంగా విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. రాయల సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాయల కుటుంబం నిజాంనిరంకుశ పాలనకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించారని, సర్పంచ్‌గా, ఎంపీటీసీగా గ్రామాభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. ఈకార్యక్రమంలో పుసులూరి నరేందర్, గుర్రం అచ్చయ్య, కె.నాగేశ్వరరావు, టి.హనుమంతరావు, ఎస్.వెకంకటేశ్వర్లు,ఆ రోశివలింగం, ఎం నాగేశ్వరరావు. పుసులూరి పుల్లయ్య రాయల రాజా, నవీన్, వెంకటస్వామి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

శతాధిక వృద్ధురాలికి సన్మానం

ఖమ్మంరూరల్, మార్చి8(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఐద్వా సీనియర్ నాయకురాలు తమ్మినేని కమలమ్మ అన్నారు. మండలంలోని తెల్దారుపల్లిలో ప్రపంచ మహిళా దినోత్సావాన్ని పురస్కరించుకొని శతాధిక వృద్ధురాలు దుంపల రోషమ్మకు శనివారం ఘన సన్మానం చేశారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని, రాజకీయాల్లో, వ్యాపారాల్లో ప్రధాన పాత్ర పోషించాలని కోరారు. యువతులు ఉద్యోగాలకే పరిమితం కాకుండా రాజకీయాల్లోకి రావాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి పెండ్యాల సుమతి, నాయకురాళ్లు టేకుమట్ల సీతమ్మ, దుంపల గ్రేస్‌మణి, తురాజు సావిత్రి, కల్పాల ఉష, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్ ఆశయాలు కొనసాగించాలి

కొణిజర్ల, మార్చి8(ఆంధ్రజ్యోతి): భారత ఉద్యమనేత రాయల సుభాష్‌చంద్రబోస్ ఆ శయాలను కొనసాగించాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ వైరా సబ్‌డివిజన్ కార్యదర్శి షేక్ ఖాసీం, జిల్లా నాయకుడు గిరి కోరా రు. సభాష్‌చంద్రబోస్ వర్ధంతిసభను ఈ నెల 11న ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నామని ఈ సభను విజయవంతం చేయాలని కోరుతూ మండలం లో శనివారం ఆయా గ్రామాల్లో పర్యటించి మాట్లాడారు.


సత్తుపల్లిరూరల్‌లో...


కల్లూరులో ఎమ్మెల్యే మట్టా రాగమయిని సన్మానిస్తున్న దృశ్యం


వైరాలో...


బోనకల్‌లో...


చింతకానిలో...


ముదిగొండలో...

ఘనంగా మహిళా దినోత్సవం

వేంసూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. మండలంలోని దిద్దుపూడి, కందుకూరు గ్రామాల్లో శనివారం సీసీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ్‌కుమార్, కాసర చంద్రశేఖర్‌రెడ్డి, పుచ్చకాయల సోమిరెడ్డి, గొర్ల వెంకట అప్పారెడ్డి పాల్గొన్నారు. సీపీఐ నాయకుడు పిల్లి భాస్కర్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

కల్లూరులో...

కల్లూరు: మహిళలు అన్ని రంగాల్లో విజయ పతాకం ఎగుర వేయాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. శనివారం కల్లూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ అధికారి నిర్మల జ్యోతి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాగమయిని సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ భాగం నీరజదేవి, ఐసీడీఎస్ అధికారులు మోహరున్నీసాబేగం, రత్తమ్మ, నవ్యలను, ఎస్ఐ హరితను సన్మానించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు, ఎంపడీవో చంద్రశేఖర్, సూపర్‌వైజర్లు సంధ్యారాణి, సుజాత, సత్యవతి, వెంకటమ్మ, భవానీ, వేము నాగమణి, కుమారి, రమాదేవి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్లలో..

కొణిజర్ల: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కొణిజర్లలోని సమత, సూపర్‌జెమ్స్ పాఠశాల యందు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమాశంకర్, ఉపాధ్యాయులు కంచేటి శ్రవంతి, కుమారి, మానస, భూలక్ష్మి, నవ్య, మరియమ్మ, మౌనిక, సుప్రియ, త్రివేణి, రంజాన్, నీరజ పాల్గొన్నారు.

వైరాలో...

వైరా: వైరాలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పలు సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు. గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థినుల తల్లిదండ్రులు మహిళా దినోత్సవ వేడుకలు చేశారు. ప్రిన్సిపల్ బి.రమాదేవి, ఇతర ఉపాధ్యాయునీలను సన్మానించారు. అలాగే లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబా మందిరంలో లయన్స్‌క్లబ్ నిర్వాహకులు డాక్టర్ కాపా మురళీకృష్ణ ఆధ్వర్యంలో మహిళలను సన్మానించారు. ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మాజీ ఎంపీపీ బొంతు సమత తదితరులున్నారు.

చింతకానిలో...

చింతకాని: మండల పరిధిలోని తిమ్మినేనిపాలెం గ్రామంలో బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో మహిళా అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శశికళ, ఏఎన్ఎం బానోత్ రాజమ్మ, ఆశా కార్యకర్తలు లక్ష్మి, మంజుల, అంగన్వాడీ టీచర్లు రాజేశ్వరి, అరుణ, ఎఫ్ఏ స్వరూప, మీరా సాహెబ్, రామారావు, సూరిబాబు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కారేపల్లిలో

కారేపల్లి: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని శనివారం ఎంపీవో రవీంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

ముదిగొండలో...

ముదిగొండ: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శనివారం లిటిల్ ఇండియన్ స్కూల్లో ఏర్పాటుచేసిన కేక్‌ను ఉపాధ్యాయినీలు కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఉపాధ్యాయునీలను సన్మానించారు.

తల్లాడలో....

తల్లాడ: మండలంలో శనివారం మహిళా దినోత్సవ వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో మహిళా రైతులు, ఉద్యోగులను, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బాలభారతి విద్యాలయంలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.

బోనకల్‌లో...

బోనకల్: మండలంలోని ఆళ్లపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మధుబాబు, పంచాయతీ కార్యదర్శి మల్లారపు శ్రీనివాసరావు, ఆత్మ కమిటీ డైరెక్టర్ కందుల పాపారావు, మర్రి తిరుపతిరావు, మరీదు బరకయ్య, బుంగా రాములు, మందడపు రవి, తోటకూర వెంకటేశ్వరరావు, జంపాల రవి తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్‌లో..

సత్తుపల్లిరూరల్: వివిధ రంగాల్లో మహిళా సాధికారతను పెంపొందించాలని,వారి కృషిని అభినందించడంతో పాటు లింగ సమానత్వంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని 6వ అదనపు జిల్లా జడ్జీ మారగాని శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం సత్తుపల్లి కోర్టుతో పాటు ఆర్టీసీ డిపో, 15వ ప్రత్యేక బెటాలియన్, ఐద్వా, యూటీఎఫ్ కార్యాలయాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో ఐసీడీఎస్ సీడీపీవో ఎన్.కనకదుర్గ, డీఎం రాజ్యలక్ష్మి, బెటాలియన్ కమాండెంట్ పీజేపీసీ.ఛటర్జీ, ప్రభుత్వ వైద్యులు పీ.వసుమతిదేవి, నవ్య ఉన్నారు..

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను మండలంలోని కొత్తూరులోని మదర్‌తెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో మిస్ట్ ఉమెన్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరావతిలోని అమ్రితా విశ్వవిద్యాపీఠం సీఎస్సీ ప్రొఫెసర్ డా.తులసి బిక్కు హాజరై ఉమెన్ విత్ ఏఐ ఏరా అనే అంశంపై ఉపదేశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.చలసాని హరికృష్ణ, ఇంజనీరింగ్ డీన్ డా.జాకీర్‌హుస్సేన్, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డా.ఎంవీ.రామచంద్రరావు, ఉమెన్ కో-ఆర్డినేటర్ ఎం.పద్మజ్యోతి, టీ.శ్రీదేవి, కే.నిరోషా, జీ.ఆషారాణి, కే.సుజాత, సీహెచ్.పావని, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మధిరటౌన్‌లో..

మధిరటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం మధిరలో ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు.

ఎర్రుపాలెంలో...

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో ఖమ్మంజిల్లా కమ్మ మహాజనసంఘం కోశాధికారి తుళ్లూరు నిర్మల కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ మూల్పూరి స్వప్నను సన్మానించారు ఈకార్యక్రమంలో సేవా సమితి సభ్యులు కె.లక్ష్మి వెంకటరమణ, సరోజిని, సీత, కమల, మల్లిక, కీర్తన, సుధ, కృష్ణవేణి, వెంకటరావమ్మ, పాప లక్ష్మి, నాగమల్లేశ్వరి, శ్రీలక్ష్మి, ఎల్వీ నారాయణరెడ్డి, బొబ్బకిరణ్, లీలాకృష్ణ, చొప్పవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మధిరటౌన్‌లో....


ఎర్రుపాలెంలో....


కారేపల్లిలో...


తల్లాడలో....


కొణిజర్లలో...



పెనుబల్లిలో...

మౌలిక వసతుల కల్పనతో ప్రాంతాల అభివృద్ధి


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

» ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, మార్చి8 (ఆంధ్రజ్యోతి): మౌలిక సదుపాయల కల్పనతో ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లి పట్టణంలోని కొత్త కొమ్మేపల్లి కాలనీలో శనివారం సింగరేణి సౌజన్యంతో సుమారు రూ.60.89లక్షల అంచనాతో నూతనంగా నిర్మించనున్న రామాలయం (రూ.19.66లక్షలు), మసీద్ (రూ..22.03లక్షలు), చర్చీ (రూ.19.20లక్షలు) భవనాలకు భూమిపూజ చేశారు. ఇప్పటికే సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులు పట్టణంలో చేపడుతుండగా అవసరమైన ప్రాంతాలను గుర్తించి నిధులను వెచ్చిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జేవీఆర్ ఓసీ పీవో ఎస్‌వీఎస్‌వి. ప్రహ్లాద్, కిష్టారం ఓసీ పీవో ఎంవీ.నరసింహారావు, మేనేజర్ రాజేశ్వరరావు, వెల్ఫేర్ ఆఫీసర్ దేవదాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామినేని నాగమణికి పలువురి నివాళి


నాగమణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తాతా, సండ్ర

ముదిగొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ సతీమణి నాగమణి ఇటీవల మృతిచెందగా ఆమె దశదినకర్మలు శనివారం నిర్వహించారు. నాగమణి చిత్రపటానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, కొండబాల కోటేశ్వరరావు, నాయకులు వాచేపల్లి లక్ష్మారెడ్డి, పోట్ల వెంకటప్రసాద్, మీగడ శ్రీనివాస్, బంకా మల్లయ్య, గడ్డం వెంకట్, సీతరామయ్యలు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్‌ను పరామర్శించారు.

కల్లూరులో...

కల్లూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శనివారం పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. మండలంలోని యర్రబోయినపల్లిలో కోటా శ్రీనివాసరావు మాతృమూర్తి, జెట్టి శంకర్ తండ్రి ఇటీవల మృతి చెందగా సదరు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నల్లగట్ల వెంకటేశ్వరరావు, బీరవల్లి వీరయ్య, వీరప్ప, మోహన్‌రావు, నరసింహారావుల కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రఘు,మాజీ జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు పోట్రు కిరణ్, కొమ్మినేని నరసింహారావు, పూసులూరి శ్రీనివాసరావు, కాకర్ల రామకృష్ణ, కల్లగట్ల ప్రకాశం తదితరులున్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్లు, పెన్షన్లు ఇవ్వాలి

» సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు


సమావేశంలో మాట్లాడుతున్న గోపాలరావు

మధిర రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్లు, పెన్షన్లు ఇవ్వాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక బోడేపూడి భవన్‌లో మధిరలో వూట్ల శంకర్రావ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ఇండ్లు, పెన్షన్లు, రేషన్‌కార్డులు అందిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటికీ వాటిని అమలు చేయడంలో వైఫల్యం చెందిందన్నారు. అర్హులందరికీ ఇండ్లు, పింఛన్లు, రేషన్‌కార్డులు అందిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటికీ వాటిని అమలు చేయడంలో వైఫల్యం చెందిందన్నారు. తమకు కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా ఇల్లు వస్తుందని ఆశతో పేదలకు నిరాశే మిగిలిందన్నారు. అర్హుల కంటే అనర్హులను ఎంపిక చేస్తూ గ్రామసభల్లో ప్రజా ఆగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వం కారణమైందన్నారు. మధిర మునిసిపాలిటీలో ఉపాధి హామీ పనులు కల్పించాలని, పేదలందరికి ఇందిరమ్మ భరోసా కింద రూ. 12వేలు ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు శీలం నర్సింహారావు, మందా సైదులు, నాయకులు పడకంటి మురళీ, పాపినేని రాంనర్సయ్య, షేక్.ఉద్దండు, ధనలక్ష్మి, వెంకాయమ్మ, బాజినేని వెంకటనర్సయ్య, అంకె శివయ్య, పుచ్చకాయల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో విద్యార్థి ప్రతిభ

కల్లూరు, మార్చి8 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని సెంచరీ టెక్నో స్కూల్ చెందిన డి. మోక్షిత్ నాయక్ హైదరాబాద్‌లో భారతీయ ప్రతిభా ఒలింపియాడ్ (ఐబీవో) వారు నిర్వహించిన బ్రిలియంట్ ఒలింపియాడ్ గణితంలో రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటైన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో మోక్షిత్‌నాయక్‌కు ఐబీవో సంస్థ అధినేత శ్రీనివాస్ అవార్డును అందజేశారు. సెంచరీ టెక్నో స్కూల్‌లో మోక్షిత్ నాయక్ 4 వతరగతి చదువుతున్నాడు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో కరస్పాండెంట్ ఏగుపాటి కృష్ణారావు, ప్రిన్సిపాల్ యండి బర్కుతుల్లాలు విద్యార్థిని అభినందించారు.



మోక్షిత్‌నాయక్‌కు అవార్డు అందజేస్తున్న ఐబీవో ఫౌండేషన్ అధినేత శ్రీనివాస్

సుభాష్ చంద్రబోస్ ఆశయాలు కొనసాగించాలి

కొణిజర్ల, మార్చి8(ఆంధ్రజ్యోతి): భారత ఉద్యమనేత రాయల సుభాష్‌చంద్రబోస్ ఆశయాలను కొనసాగించాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ వైరా సబ్‌డివిజన్ కార్యదర్శి షేక్ ఖాసీం, జిల్లా నాయకుడు గిరి కోరారు. సభాష్‌చంద్రబోస్ వర్ధంతిసభను ఈ నెల 11న ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నామని ఈ సభను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలో శనివారం ఆయా గ్రామాల్లో పర్యటించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కిషన్, పటాన్‌ఖాసీంఖాన్, భాష, ఉపేందర్, వెంకటేశ్వర్లు, దేవదానం, ఉదయ్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

వైరా, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెబ్బవరం గ్రామంలో వేసవి కరెంట్ అవసరాల దృష్ట్యా నూతనంగా సింగిల్‌ఫేజ్ 25కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేశారు. ట్రాన్స్‌కో వైరా ఏడీఈ పి.కిరణ్ కుమార్ శనివారం ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఏఈ పాలేటి వెంకటసాయికుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, లైన్‌మెన్ భరత్, సలీం, మాజీ సర్పంచ్ సాదం రామారావు పాల్గొన్నారు.

'ఎన్నికల్లో ముస్లింలకు ప్రాధాన్యత ఇవ్వాలి'

బోనకల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పార్టీలు ముస్లీం మైనార్టీలకు తగు ప్రాధాన్యత ఇవ్వాలని ఆ సంఘ మండల అధ్యక్షుడు షేక్ మహబూబ్ పాషా డిమాండ్ చేశారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణన ఆధారంగా ముస్లింల జనాభా లెక్కలతో సహా బహిర్గతమైందన్నారు. ముస్లింలను ఓటు బ్యాంకుగా చూడవద్దని సూచించారు గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు పదివేల ఆర్థిక సాయాన్ని సంఘం ద్వారా అందజేశారు. ఈ సమావేశంలో చాంద్ సాహెబ్, షేక్ జానిమీయా, షాజహాన్, రఫీ, రంజాన్, హసన్, షరీఫ్ తదితరులున్నారు.

పశు వైద్య శిబిరం

బోనకల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరునోముల గ్రామంలో శనివారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశు వైద్యాధికారి అన్వేష్ గర్భకోశ వ్యాధులు, చూడి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, నాగేంద్ర కుమార్, రవికృష్ణ, పశు, గోపాల మిత్రలు కృష్ణవేణి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 434 కేసులు పరిష్కారం

» 6వ అదనపు జిల్లా న్యాయాధికారి మారగాని శ్రీనివాస్



మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీనివాస్

సత్తుపల్లి, మార్చి8 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరికీ న్యాయ విజ్ఞానాన్ని అందించడంలో సం స్థ తనవంతు కృషి చేస్తుందని 6వ అదనపు జిల్లా జడ్జీ మారగాని శ్రీనివాస్ అన్నారు. సత్తుపల్లి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టులో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అ నంతరం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 434కేసులను పరిష్కరించి రూ. 32,61,500నగదును ఆయా కేసులలో రికవరీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధి కారి ఎస్‌కే. మీరాఖాసీంసాహెబ్, అదనపు జూ నియర్ సివిల్ న్యాయాధికారి ఎస్‌కే.ఆయేషాషరీన్, ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి జే.గోపాలరావు, కల్లూరు ఏసీపీ ఏ. రఘు, పట్టణ సీఐ కిరణ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టీ.ఆడమ్స్ న్యాయవాదులు, ఐసీడీఎస్ సీడీపీవో కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

మధిరటౌన్‌లో...

మధిరటౌన్, మార్చి8(ఆంధ్రజ్యోతి): లోక్‌అదాలత్ ద్వారా రాజీపడి డబ్బు సమయాన్ని ఆదా చేసుకోవాలని మధిర కోర్టు న్యాయమూర్తి రాళ్లబండి శాంతి లత అన్నారు. శనివారం మధిర కోర్టులో లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. మధిర జూనియర్ సివిల్ జడ్జి కోర్టుతో పాటు సబ్‌కోర్టులో 298 కేసులు పరిష్కరించడమే కాకుండా జరిమానా ద్వారా రూ.2,37,256 వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లారావు, న్యాయవాదులు వాసంసెట్టి కోటేశ్వరరావు, రామరాజు, సుబ్రహ్మణ్యం, జగన్మోహన్‌రావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయవాదులు

ఘనంగా హరిహరక్షేత్ర వార్షికోత్సవం

వేంసూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగపాలెం గ్రామంలో హరిహరక్షేత్ర ఐదో వార్షికోత్సవ వేడుకలను శనివారం ప్రారంభించారు. హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. రాత్రి 7గంటలకు బూర్గుల రవిశాస్త్రీ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 11గంటలకు లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. సోమవారం ప్రత్యేక పూజల అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.


పూజలు చేస్తున్న భక్తులు

కల్యాణోత్సవాలకు వేంకటేశ్వరస్వామి ఆలయం ముస్తాబు

వేంసూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుకూరులోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఈనెల 10వతేదీ నుంచి 15వతేదీ వరకు నిర్వహించనున్నారు. 10న ప్రత్యేక పూజలు, ధ్వజారోహణం, 11న నిత్య హోమం, బలిహరణ, ఎదుర్కోలు ఉత్సవం, 12న ప్రత్యేకపూజలు, రాత్రి శ్రీస్వామివారి కల్యాణ మహోత్సవం, 13న స్వామివారి గ్రామసేవ అన్నదాన కార్యక్రమం, రాత్రి 9.30గంటలకు స్వామివారి దివ్య రథోత్సవం, 14న దొంగల దోపోత్సవం, 15న ప్రత్యేక పూజలు, రాత్రి స్వామివారి పవళింపు సేవ నిర్వహించనున్నారు. ఈవో వీఎల్‌వీ.వెంకట్రావ్, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కల్యాణమహోత్సవాలకు సం బంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల సందర్భం గా పలు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేశారు. స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా గ్రామస్థు ల ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండ లాగుడు పోటీలు ఈనెల 13నుంచి 15వతేదీ వరకు నిర్వహించనున్నారు. కల్యాణోత్సవాలను పురస్కరించుకొని ఆలయానికి రంగులు వేసి విద్యుత్‌దీపాలతో అలంకరించారు.



కందుకూరు గ్రామంలో పడమర భాగాన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ఉంది. పూర్వం సుమారు 500సంవత్సరాల కిందట ఒక భక్తుడు కోరిక మేరకు గ్రామంలో స్వామి వారు వెలసినట్లు ప్రసిద్ధి.. ప్రస్తుత ఆలయ ప్రదేశం స్థాపించి, దేవాలయం కట్టించి నిత్యపూజారులకు ఎట్టి లోపము లేకుండా ఆగమ శాస్త్రరీత్యా ని ర్వహించుటకు ప్రతి నిత్యం ఒక ఎకరం భూమిలో పండిన పంట నైవేద్యంగా వండి పెట్టేవారు. అందువలన 360 ఎకరాల అగ్రహారముగా కలిగి ఉన్నది. అట్టి భక్తుడి యొక్క వివరాలు, వారి గోత్రనామాలు కూడా తెలియవు. ఇక్కడ స్వామివారి దక్షిణ ముఖం కలిగి ఉంటారు. ఈ ఆలయంలో ఉత్సవమూర్తులు రెండు సెట్లు కలిగి ఉండుట విశేషం. ప్రతి సంవత్సరం పాల్గున శుద్ధ ద్వాదశి నుంచి పాల్గున బహుళ విజయ వరకు కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తారు.


కందుకూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయం